క్లుప్తంగా

మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలి



వేడుకల్లో అధ్యాపకులు, విద్యార్థినులు

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పి. ఇందిరాదేవి మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలన్నారు. విద్యార్థినులు ధైర్యంగా సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాలు



రుషిక

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి జెడ్పీహెచ్ఎస్ తొమ్మిదో తరగతి విద్యార్థినులకు కోరమాండల్ కంపెనీకి చెందిన గర్ల్ అండ్ చైల్డ్ స్కాలర్‌షిప్ పథకం కింద ప్రతిభా పుర స్కారాలు అందించారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ ఆడిటోరియంలో కలెక్టర్ ఆర్ వీ కర్ణన్ చేతుల మీదుగా పురస్కారాలు స్వీకరించినట్లు హెచ్ఎం రాజమౌళి తెలిపారు. గతేడాది వార్షిక పరీక్షల్లో చట్ల రుషిక, త్రివేణి ప్రథమస్థానంలో ఉత్తీర్ణులు కాగా రూ.5,000 చొప్పున, చట్ల త్రిష ద్వితీయ స్థానంలో ఉత్తీర్ణత సాధించగా రూ.3,500, ప్రశంసాపత్రాలను కలెక్టర్ అందజేశారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



పిల్లలతో మాట్లాడుతున్న ఎంపీపీ మల్లారెడ్డి

గన్నేరువరం: మండల కేంద్రంలోని రెండో అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఎంపీపీ లింగాల మల్లారెడ్డి తనిఖీ చేశారు. పిల్లలకు అందించే పౌష్టికాహారం పరిశీలించారు. గర్భిణులు, తల్లులు, పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతలపల్లి నర్సింహారెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బొడ్డు సునీల్, నాయకులు దుడ్డు మల్లేశం, అంగన్‌వాడీ టీచర్ ఆకెన పుష్పలత పాల్గొన్నారు.

ఇసుక తరలింపుపై స్టే



స్టే ఉత్తర్వులను చూపిస్తున్న నాయకులు

చిగురుమామిడి: మండలంలోని నవాబుపేట్ గ్రామం మోయతుమ్మెద వాగునుంచి ఇసుక తరలించొద్దని బీజేపీ నాయకులు హైకోర్టును ఆశ్రయించారు. గతనెల రెండో తేదీన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ వేయగా హైకోర్టు ఈ నెల 2న ఇసుక తరలింపు నిలిపివేయాలని స్టే విధించింది. కాగా వాగు నుంచి ప్రతిరోజు గౌరవెల్లి సాగునీటి ప్రాజెక్ట్‌కు ఇసుకను తరలించారు. దీంతో బోర్లు, వ్యవసాయబావులు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు, బీజేపీ నాయకులు ధర్నా, నిరసనలు చేపట్టారు. అయినా పట్టించుకోకుండా పోలీసులతో కేసులు నమోదు చేయించారు. గత్యంతరంలేక హైకోర్టును ఆశ్రయించడంతో స్టే మంజూరు చేసిందని బీజేపీ మండలశాఖ ఉపాధ్యక్షుడు బోయిని వంశీకృష్ణ తెలిపారు. దీంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

పనులు ప్రారంభించాలి



ధర్నా చేస్తున్న ఉదయ్, ప్రయాణికులు

గన్నేరువరం: గుండ్లపల్లి నుంచి గన్నేరువరం మీదుగా రాజన్న సిరిసిల్లా జిల్లా ఇల్లంతకుంట మండలం పొత్తూరు వరకు డబుల్ రోడ్డు పనులు ప్రారంభించాలని వైఎస్సార్‌టీపీ జిల్లా నాయకుడు సంపతి ఉదయ్ అన్నారు. శనివారం గుండ్లపల్లిలో ప్రయాణికులతో కలిసి ధర్నా చేశారు. గుండ్లపల్లి – గునుకులకొండాపూర్ మధ్య మట్టి రోడ్డుతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారని, గన్నేరువరంను అన్నిరంగాల్లో అభివృద్ధి చేయాలని, లేదంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

ఉన్నది ఇరుకైంది

- విస్తరణ కోసం సీసీరోడ్డును తవ్వారు
- నెలలు గడుస్తున్నా వెడల్పు చేయని వైనం
- నిధులు లేక నిలిచిన పనులు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు



ఇరుకుగా మారిన పాత గ్రామ పంచాయతీ రోడ్డు



పెద్ద వాహనాలు వస్తే వెళ్లలేని పరిస్థితి ఇది

చొప్పదండి: 'అట్లనో..ఇట్లనో ఎల్లదీసుకుంటున్న రోడ్డును వెడల్పు చేస్తామని తవ్వారు. నెలలు గడుస్తున్నా.. వెడల్పు చేయడం లేదు. దీంతో ఆ రోడ్డుపై ప్రయాణం చేయడానికి వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. భారీ వాహనాలు రోడ్డుపై వెళ్లడం గగనం. పాత సీసీని ధ్వంసం చేయడంతో గతుకుల రోడ్డుపై ప్రయాణం కష్టంగా మారింది' అంటు చొప్పదండి పట్టణంలోని నడిమివాడ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మున్సిపాలిటీగా ఏర్పడిన చొప్పదండిలో అధికారులు, పాలకవర్గం రోడ్ల వెడల్పుపై దృష్టి సారించారు. పట్టణంలోని పాత గ్రామ పంచాయతీ నుంచి మజీద్ మీదుగా శ్రీరామ టాకీస్ వరకు పురాతన రోడ్డును మొదట అభివృద్ధి చేసేందుకు పాలకవర్గ సభ్యులు తీర్మానం చేశారు. ఈ మేరకు మున్సిపల్ నిబంధనల మేరకు రోడ్డును ముప్పై అడుగుల వెడల్పు చేసేందుకు కొలతలు వేశారు. అయిదారు దశాబ్దాల క్రితం నిర్మించిన పలు కట్టడాలు తీసివేయాల్సి రావడంతో అందరి ఆమోదం మేరకు ప్రస్తుతం దారిని 25 అడుగుల మేరకు అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు రోడ్డుకు ఇరువైపులా మార్కింగ్ కూడా చేశారు. ఇంటి యజమానులకు నోటీసులను అందించారు. పైప్‌లైన్‌లు వేయడానికి రోడ్డును కూడా ధ్వంసం చేశారు. కొత్త రోడ్డు వేయడం ఆలస్యమవుతుండటంతో ప్రజలకు కష్టాలు ప్రారంభమయ్యాయి.

ప్రయాణికుల అగచాట్లు తీర్చాలి

ప్రధాన మజీద్ రోడ్డుకు గడ్డుకాలం వచ్చింది. రోడ్డు వెడల్పు కోసం పాలకవర్గ సభ్యులు, అధికారులు నిర్ణయం తీసుకుంటున్నప్పటికి నిధుల లేమితో రోడ్డు అభివృద్ధి జరగడం లేదు. గతంలో రోడ్డు నిర్మాణానికి మున్సిపల్ పాలకవర్గం నిధులు కేటాయించినా అవి సరిపోయే అవకాశం లేక పోవడంతో పనులు మొదలుపెట్టలేదు. దీంతో రోడ్డు వెడల్పు కార్యక్రమం పూర్తి కాక, కొత్త రోడ్డు వేయక ప్రయాణికులకు గండంగా మారింది. రెండు వైపుల మురుగుకాలువలు, మధ్యలో ధ్వంసమైన సీసీ రోడ్డు, మట్టి కుప్పలతో ఆటో, కారు వస్తే బైక్ వెళ్లడానికి కూడా ఇబ్బంది పడాల్సి వస్తోంది. శివారు ప్రాంతాల్లో సీసీ రోడ్లు వేస్తున్న పాలకవర్గ సభ్యులు నాలుగైదు వార్డులకు అనుసంధానంగా ఉన్న రోడ్డును విస్మరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. పట్టణంలోనే అత్యంత ఆవశ్యకత ఉన్న రోడ్డుకు మొదటి ప్రాధాన్యతగా నిధులు కేటాయించి రోడ్డు నిర్మాణం సత్వరమే పూర్తి చేయాలని, ప్రయాణికుల అగచాట్లు తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

రద్దీ రోడ్డుపై నిరక్ష్యం



చొప్పదండిలో అత్యంత రద్దీగా ఉండే రోడ్డు విస్తరణపై నిర్లక్ష్యం చేస్తున్నారు. సీసీరోడ్డు తవ్వి వదిలేశారు. ఎదురెదురుగా వాహనాలు వెళ్లలేని పరిస్థితి. నెలలు గడిచినా పాలకవర్గసభ్యులు, అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయం. త్వరగా రోడ్డు నిర్మించాలి.
– కొక్కుల రామ్మోహన్, గణేశ్ నగర్

నిధులు సరిపోవని ఆపేశాం



పాత గ్రామ పంచాయతీ నుంచి ఎన్‌టీఆర్ చౌరస్తా వరకు రోడ్డు ప్రాధాన్యతను ఇప్పటికే గుర్తించాం. రోడ్డు వెడల్పుకు ఇంటియజమానులకు నోటీసులు ఇచ్చాం. ప్రస్తుతం కేటాయించిన నిధులు సరిపోవని పనులు ఆపివేశాం. మరిన్ని నిధులు వచ్చాక రోడ్డు పూర్తి చేస్తాం. ప్రయాణికుల కష్టాలు తొలగిస్తాం.
– గుర్రం నీరజ, మున్సిపల్ చైర్‌పర్సన్, చొప్పదండి

'పది' విద్యార్థులపై శ్రద్ధ చూపాలి

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో గణిత, సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులకు కాంప్లెక్స్ సమావేశం శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా సెక్రెటరీ కర్ణఅశోక్‌రెడ్డి, గణిత డీఆర్పీ మనోహర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. పదోతరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వార్షిక పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించేలా చూడాలన్నారు. అనంతరం ఇన్‌చార్జి విద్యాధికారి విడపు శ్రీనివాస్ మాట్లాడుతూ.. గతేడాది ఉత్తమ ఫలితాలు నమోదయ్యాయని, ఈ విద్యా సంవత్సరం ఎలాంటి ఇబ్బంది లేకుండా వందశాతం సిలబస్ పూర్తి చేసి పరీక్షలకు హాజరుకాబోతున్నామని తెలిపారు. కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్లు, హెచ్‌ఎంలు సాంబయ్య, పద్మ, ఆర్పీలు సదయ్య, ప్రణీతాదేవి, కిషన్‌రెడ్డి, సదానందం, జమ్మికుంట, ఇల్లందకుంట, వీణవంక మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన ఉపాధ్యాయులు

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్



పరీక్షా సామగ్రి పంపిణీ చేస్తున్న వెంకటేశ్వర్‌రావు



చిన్నముల్కనూర్‌లో జగదీశ్వర్

రామడుగు: విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని రామడుగు సింగిల్ విండో చైర్మన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు వీర్ల వేంకటేశ్వర్‌రావు తెలిపారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ పదో తరగతి విద్యార్థులకు శనివారం పరీక్షా సామగ్రి పంపిణీ చేశారు. ఉపాధ్యాయుల సూచనలతో మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఎంపీపీ కవిత, బీఆర్‌ఎస్ మండలశాఖ అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి, మాజీ ఎంపీపీ కిష్టారెడ్డి, సర్పంచ్ ప్రమీల, నాయకులు వెంకట్‌రెడ్డి, మునీందర్, రాజేశం, శారదపాల్గొన్నారు.

చిగురుమామిడి: మండలంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులు 224 మందికి హుజూరాబాద్‌లోని గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో పరీక్షా సామగ్రి పంపిణీ చేశారు. శనివారం చిన్నముల్కనూర్ ఆదర్శ పాఠశాలలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. పది జెడ్పీహెచ్ఎస్, మోడల్ స్కూల్, కేజీబీవీల్లో అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్, ట్రస్టు అధ్యక్షుడు గంగిశెట్టి జగదీశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఇసుక తవ్వకాల అడ్డగింత

మానకొండూర్: మండలంలోని లింగాపూర్ మానేరు వాగులో శనివారం ఇసుక తవ్వకాలను గ్రామస్తులు అడ్డుకున్నారు. గ్రామ శివారులో 200 ఎకరాల వ్యవసాయ భూములున్నాయని ఇసుకను తరలిస్తే భూగర్భ జలాలు అడుగంటుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు సాండ్ టాక్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధి నిరంతర ప్రక్రియ

జమ్మికుంట: పట్టణ సుందరీకరణ, అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు అన్నారు. మున్సిపల్ పరిధి ధర్మారంలో హైమాస్ట్ లైట్లను శుక్రవారం రాత్రి ప్రారంభించారు. పట్టణ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం కౌన్సిలర్లు చైర్మన్‌ను శాలువాతో సత్కరించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఇల్లందకుంట: మండలంలోని గడ్డివానిపల్లి గ్రామానికి చెందిన కూకట్ల లక్ష్మణ్(42) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. లక్ష్మణ్ ఇటీవల కూతురు వివాహానికి రూ. 3 లక్షల వరకు అప్పు చేశాడు. అప్పు ఎలా తీర్చాలనే బెంగతో ఈ నెల 2న పురుగులమందు తాగాడు. మృతుడి భార్య విమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తోట తిరుపతి తెలిపారు.

ఎంపీకి సన్మానం



ఎంపీని సన్మానిస్తున్న నారాయణ

చొప్పదండి: మండలంలోని చాకుంటకు చెందిన దాసరి నారాయణ శనివారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్‌కుమార్‌ను సన్మానించారు. బతుకుదెరువు కోసం పదహారు నెలల క్రితం నారాయణ దుబాయి వెళ్లాడు. ఉపాధి లేక అక్కడే చిక్కుకుపోగా ఆయన పరిస్థితిని ఎంపీ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే విదేశాంగ మంత్రి సుబ్రహ్మణ్యంజైశంకర్ ద్వారా నారాయణను ఇండియాకు రప్పించారు. సురక్షితంగా స్వగ్రామానికి చేరుకునేలా కృషిచేసిన ఎంపీని నారాయణ సన్మానించి కృతజ్ఞతలు తెలిపాడు.

పాడి కౌశిక్‌రెడ్డిని కలిసిన నాయకులు



శుభాకాంక్షలు తెలుపుతున్న రాజేశ్వర్‌రావు

జమ్మికుంట: ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి ప్రభుత్వ విప్ ప్రమాణ స్వీకారానికి జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ శ్రేణులు తరలి వెళ్లారు. పాడి కౌశిక్‌రెడ్డిని కలిసి పుష్ప గుచ్ఛంతో శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమలో పీఏసీఎస్ చైర్మన్ సంపత్, దళితబంధు మండల కోఆర్డినేటర్ దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

తాడికల్‌లో వైద్యశిబిరం

శంకరపట్నం: మండలంలోని తాడికల్‌లో శనివారం ఇండియన్ మెడికల్ అసోషియేషన్, కేపీఆర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు వంశీధర్‌రెడ్డి, గీతారెడ్డి గ్రామస్తులకు వైద్యపరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సుజాత, ఎంపీటీసీ వరలక్ష్మి, ఉపసర్పంచ్ కుమారస్వామి, విండో చైర్మన్ సంజీవరెడ్డి, ఎంపీడీవో బషీరొద్దీన్, మాజీ ఎంపీటీసీ రహీమ్, ప్రకాశ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

గంగాధర: గ్రామాల అభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తుందని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. శనివారం మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామంలో ఐదులక్షల రూపాయలతో నిర్మించనున్న సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం గోపాల్‌రావుపల్లి, వెంకంపల్లి గ్రామాల్లో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచులు,ఎంపీటీసీలు,నాయకులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

చొప్పదండి: మండలంలోని ఆర్నకొండ గ్రామానికి చెందిన ఎం. కవిత అనారోగ్యంతో బాధపడుతోంది. స్థానిక బీఆర్‌ఎస్ నాయకుల ద్వారా ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను సంప్రదించగా వైద్య చికిత్సకు రూ. 2.50 లక్షల ఎల్‌వోసీని మంజూరు చేయించారు. ఈమేరకు శనివారం క్యాంపు కార్యాలయంలో ఎల్‌వోసీని అందించారు. కార్యక్రమంలో మచ్చ రమేశ్, పూసాల మహేశ్, యశోద రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

విధుల్లోకి తీసుకోవాలని ఆసుపత్రి ఎదుట దీక్ష



దీక్ష చేస్తున్న ఆసుపత్రిలో పనిచేసిన వర్కర్స్

జమ్మికుంట: జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిలో పదేళ్లపేషెంట్ కేర్, శానిటేషన్, సెక్యూరిటీ గార్డులుగా పని చేసిన వర్కర్స్‌ను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ డిమాండ్ చేశారు. శనివారం ఆసుపత్రి ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో వర్కర్స్‌తో దీక్ష చేపట్టారు. సీనియారిటీ పద్ధతిలో ఎంపిక చేయకుండా రాజకీయ నాయకుల పైరవీలతో వర్కర్స్ నియమించారని, ఇక్కడ పనిచేసేవారిని వద్దంటే ఎక్కడికి పోతారని అన్నారు. ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ పాడి కౌశిక్‌రెడ్డి, మండలంలోని అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు సమస్యలు విన్నవించినా రెండు నెలలుగా మభ్య పెడుతూ విధుల్లోకి తీసుకోడం లేదని ఆరోపించారు. కుటుంబాలు రోడ్డున పడ్డాయని, నిబంధనలకు విరుద్ధంగా పనిలోకి తీసుకుని ఇప్పుడు జీవో ప్రకారం తీసి వేశామని చెబుతున్నారని, కరోనా సమయంలో ప్రాణాలను లెక్క చేయకుండా సేవలు అందించామన్నారు. పనిలోకి తీసుకునే వరకు ఆందోళనలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి వర్కర్స్ యూనియన్ కమిటీ సభ్యులు సంధ్య, కళావతి, లలిత, భారతి, ఉమా, సరోజ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి వరిసాగుపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

గంగాధర: మండలంలోని కురిక్యాల గ్రామంలో శనివారం వ్యవసాయశాఖ, పద్మపాణి స్వచ్ఛంద సంస్థ, కోర్ కార్బన్ ఎక్స్ సొల్యూషన్ ఆధ్వర్యంలో రైతులకు తడి, పొడి వరిసాగుపై అవగాహన కల్పించారు. ఈ పద్ధతిలో నీటి ఎద్దడిని అధిగమించవచ్చని, తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నవీన్‌రావు, ఏవో రాజు, ఏఈవో గోపిచంద్, సీసీఎక్స్ మెంబర్ రమేశ్, రైతులు పాల్గొన్నారు.

ప్రాచీన కళలను కాపాడుకోవాలి



ప్రశంసా పత్రాలు అందుకుంటున్న కళాకారులు

వీణవంక: ప్రాచీన కళలను పాడుకోవాలని కరీంనగర్ జిల్లా రంగస్థల కళాకారుల అధ్యక్షుడు వంగ సుధాకర్ అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని ఘన్ముకుల గ్రామంలో మూడు రోజులుగా కొనసాగుతున్న చిడతల రామాయణం ముగింపు కార్యక్రమంలో మాట్లాడారు. తెలంగాణ కళలకు మంచి ఆదరాభిమానాలు ఉన్నాయని, కళాకారులకు వెన్నంటి ఉంటూ తమవంతు ప్రోత్సాహం అందిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం కళాకారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సునీతమల్లారెడ్డి, ఎంపీటీసీ సంజీవరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అలువేలు సమ్మిరెడ్డి, మండల అధ్యక్షుడు నల్లగోని రమేశ్, కళాకారులు పాల్గొన్నారు.

వరదకాలువ పనుల పరిశీలన



కాలువ పనులు పరిశీలిస్తున్న కొత్త తిరుపతిరెడ్డి

సైదాపూర్: మండలంలోని గుజ్జులపల్లిలో వరద కాలువ పనులను శనివారం సింగిల్ విండో చైర్మన్ కొత్త తిరుపతిరెడ్డి, సర్పంచ్ సదానందం పరిశీలించారు. కాలువ కింద భూములు కోల్పోతున్న ప్రభుత్వం నుంచి పరిహారం రాలేదని కొందరు రైతులు కాలువ పనులను నిలిపివేయించారు. దీంతో గుజ్జులపల్లి వరకు కాళేశ్వరం, మిడ్‌మానేర్ కుడి కాలువ ద్వారా వస్తున్న సాగునీరు పొలాలకు అందడంలేదని ఆయా గ్రామాల రైతులు చైర్మన్‌కు వివరించారు. ఈమేరకు కాలువ పరిస్థితులను పరిశీలించి ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే తహసీల్దార్‌తో మాట్లాడారు. భూములు కోల్పోయే రైతులకు త్వరలో పరిహారం ఇప్పిస్తామని తహసీల్దార్ తెలిపారు. దీంతో రైతులు కాలువ పూడిక పనులు చేపట్టారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపిన చైర్మన్‌కు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన జాతీయస్థాయి సాంకేతిక సదస్సు



విద్యార్థులతో షకలక శంకర్, డైరెక్టర్ వెంకటరెడ్డి

తిమ్మాపూర్: మండలంలోని శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహించిన జాతీయస్థాయి టెక్నికల్ ఫెస్ట్ శోధ 2కె23 శనివారంతో ముగిసింది. దళారి సినిమా హీరో షకలక శంకర్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ జి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకే టెక్నికల్ ఫెస్ట్‌లు ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులు తయారు చేసిన మోడల్స్‌తో విజ్ఞానం పెంపొందడంతోపాటు నూతన ఆవిష్కరణలపై అవగాహన, కఠినతర అంశాలు క్షుణ్ణంగా అర్థం చేసుకుంటారని అన్నారు. ప్రతి డిపార్ట్‌మెంట్ ఇలాంటి సదస్సులు నిర్వహించాలని కోరారు. అనంతరం మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ బి.రవీందర్ మాట్లాడుతూ.. సాంకేతిక సదస్సులో పాల్గొన్న విద్యార్థుల్లో విజేతలకు సర్టిఫికెట్స్‌తో పాటు దాదాపు 100 మంది విద్యార్థులకు బహుమతు ప్రదానం చేశామని వివరించారు. అనంతరం షకలక శంకర్, డైరెక్టర్ కె.గోపాల్‌రెడ్డి, నిర్మాత ఏ. వెంకట్‌రెడ్డి విద్యార్థులను ఆనందింపజేశారు. కార్యక్రమంలో అకాడమిక్ ఇన్‌చార్జి శశికాంత్, ఏవో రామారావు, మీడియా ఇన్‌చార్జి గొంటి రమేశ్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రామడుగు: మండలంలోని వెలిచాల శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం దేవాలయంలో వేద పండితులు ప్రత్యేకంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయాభివృద్ధి కమిటీ చైర్మన్ వీర్ల ప్రభాకర్‌రావు, సర్పంచ్ వీర్ల సరోజన, రైతుబంధు జిల్లా కమిటీ సభ్యులు సంజీవరావు, రవీందర్‌రావు భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా నరసింహస్వామి కల్యాణం



స్వామివారి జ్ఞాపిక అందిస్తున్న అర్చకులు

ఇల్లందకుంట: మండలంలోని చిన్నకోమటిపల్లి గ్రామంలోని స్వయంభు నల్లగొండ నరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ స్వామివారి కల్యాణంలో పాల్గొన్నారు. అనంతరం అర్చకులు ప్రదీప్, దేవస్థాన నిర్వాహకులు ఈటలకు స్వామివారి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు, ఎండీ.షఫీ, ఆరెల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయానికి విరాళం

చొప్పదండి: పట్టణంలో నిర్మిస్తున్న సాయిబాబా ఆలయానికి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి శనివారం రూ. 51,116 విరాళం ఆలయ చైర్మన్ గుర్రం హన్మంతరెడ్డికి ఆలయ ఆవరణలో అందించారు. మార్చి 6 నుంచి 9 వరకు విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహక ట్రస్టు సభ్యులు లింగన్న, రాము, లక్ష్మీనర్సయ్య, నాయకులు నలుమాచు రామక్రిష్ణ, ఆరెళ్ళి చంద్రశేఖర్ గౌడ్, గుర్రం చంద్రారెడ్డి, తాటిపెల్లి అంజయ్య, మంచాల మోహన్, వెల్మ శ్రీనివాస్‌రెడ్డి, కొత్తూరి మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

రామడుగు: మండలంలోని వెదిర శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయాభివృద్ధి కమిటీ సభ్యులు శనివారం జిల్లా రైస్ మిల్లర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు బోయినపల్లి నర్సింగరావును సన్మానించారు. దేవాలయాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చెన్నమనేని రాజేందర్‌రావు, మాజీ ఎంపీపీ వంచ సుదర్శన్‌రెడ్డి, రైతుబంధు కమిటీ కన్వీనర్ లచిరెడ్డి, ఉపసర్పంచ్ సత్యనారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ పురుషోత్తంరెడ్డి, వీడీసీ నాగుల రాజశేఖర్‌గౌడ్, చెన్నమనేని రవీందర్‌రావు పలువురు పాల్గొన్నారు.